క్లుప్తంగా

ప్రమాదకరంగా గొయ్యి



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

రామచంద్రపురం: పట్టణ నడిబొడ్డులో తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో రోడ్డుకు మధ్యలో గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారిలో మున్సిపల్ కార్యాలయం పక్క రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం, వీధిలో పాత స్టేట్ బ్యాంకు వైపు వెళుతున్న రోడ్డు మధ్యలో సిమెంట్ దిమ్మలు పగిలిపోవడంతో చాలా ప్రమాదకరంగా మారింది. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకుని ప్రమాదాలు నివారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



గౌతమీ ప్రాథమిక పాఠశాలలో పుస్తకాలను విభజిస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్య పుస్తకాలు, బెల్టులు మండలానికి చేరుకున్నట్టు ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, చింతా వెంకట సోమిరెడ్డి బుధవారం తెలిపారు. మండలంలో ఉన్నత పాఠశాలలు 12, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 56.. మొత్తం 68 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 5,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. వారికి పంపిణీ చేసేందుకు 21 వేల పుస్తకాలు రాగా, వాటిని గౌతమీ ప్రాథమిక పాఠశాల భవనంలో ఉంచామన్నారు. పాఠశాలల్లోని తరగతుల వారీగా తమ సిబ్బంది విభజిస్తున్నారని, ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే మండలంలోని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేస్తామని తెలిపారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు



మండపేటలోని భక్తాంజనేయ స్వామివారు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట సినిమా రహదారిలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించనున్న స్వామి జయంతి ఉత్సవానికి బుధవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. స్వామిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనానికి అనుమతిస్తామన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ వర్ధంతి



ఏడిదలో రాజీవ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం మండపేట మండలం ఏడిదలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగింది. గ్రామంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి డీసీసీ ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఇతర నాయకులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సాంకేతిక విద్యను అందిండంలో కీలకపాత్ర పోషించారన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మలికిపురం మండలం అంతర్వేదికి చెందిన పోతురాజు తరుణ్ నాగ సూర్య వెంకట సత్యనారాయణ, జశ్విత్ సూర్య పవన్ కుటుంబ సభ్యులు రూ.10,001లు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

గౌరవమూ లేదు.. వేతనమూ రాదు..

- కూటమి పాలనలో ఎంపీటీసీలకు తగ్గిన ప్రాధాన్యం
- అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకాల్‌కు తిలోదకాలు
- ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా అందని గౌరవ వేతనం



రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయం

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల తక్కువగా ఏడాది అవుతోంది. ఈ ఏడాదిలో ఎన్నికల హామీలను గాలికి వదిలేసిన ప్రభుత్వం కనీసం పాలనా వ్యవహారాల్లోనూ కుప్పిగంతులు వేస్తుందని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పాలనలో ప్రతి అభివృద్ధి కార్యక్రమంలోనూ ప్రజల నుంచి ఎంపికైన ప్రజాప్రతినిధులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు భాగస్వాములయ్యేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం లేకుండానే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరిగిపోతున్నాయి. మరీ ముఖ్యంగా ఎంపీటీసీలకు ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వకుండా లోకువగా చూస్తున్నారని మండిపడుతున్నారు. దీనికి ఉదాహరణగా ఈ నెల 10 న ద్రాక్షారామలో జిల్లా కలెక్టర్ సమక్షంలోనే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా నిర్వహించిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ భూమి పూజలో జరిగిన ప్రొటోకాల్ ఉల్లంఘనను ఉదాహరణగా చెబుతున్నారు. ప్రజల నుంచి ఎన్నికైన ఎంపీటీసీ పేర్లు పిలవకుండా చోటామోటా కూటమి నాయకులందరి పేర్లు స్టేజీపైకి పిలవడం దీనికి పరాకాష్టగా చెబుతున్నారు. దీనికి తోడు ప్రతినెలా ఎంపీటీసీలకు అందించాల్సిన గౌరవ వేతనం రూ.3 వేలు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉండగా కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై మండిపడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెండు విడతల్లో ఎంపీటీసీలకు గౌరవ వేతనం అందించారు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తరువాత వేతనాలు అందించలేకపోయారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తీరు మార్చుకుని ప్రజల నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం విడుదల చేయాలని కోరుతున్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు ఎటువంటి గౌరవం ఇవ్వడం లేదని తేటతెల్లం అవుతోంది. ఈ నెల 10న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోనే మొదటి సారిగా రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారామలో ఫ్లాంటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సుభాష్ భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న ప్రభుత్వ ప్రాధాన్యం ఉన్న కార్యక్రమం కాబట్టి నియోజకవర్గంలోని మూడు మండలాలు, రామచంద్రపురం మున్సిపాలిటీ నుంచి ప్రజాప్రతినిధులు అందరినీ పిలిచి ఘనంగా చేయాల్సి ఉంది. ఎవరినీ పిలవలేదు.

మండలం	ఎంపీటీసీల సంఖ్య
రామచంద్రపురం ఒకరు మృతి	20
కె.గంగవరం	18
కాజులూరు	20
మండపేట	22
కపిలేశ్వరపురం	19
రాయవరం	19

ప్రాధాన్యం ఇవ్వడం లేదు



రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, ద్రాక్షారామ–1 ఎంపీటీసీగా, వైస్ ఎంపీపీ తాను, ద్రాక్షారామ–2 ఎంపీటీసీ నున్న సత్యవతి ముగ్గురం కార్యక్రమానికి వెళ్లినా మాకు ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదు. కనీసం స్టేజీపై ఎంపీటీసీలుగా మా పేర్లు పిలవకపోవడంతో స్టేజీపై నుంచి దిగిపోదామని సిద్ధపడ్డాం. ఇంతలో ఎవరో ఆర్డీవో దేవరకొండ అఖిలకు సమాచారం ఇవ్వడంతో ఆమె సూచన మేరకు పేర్లు పిలిచారు. కూటమి ప్రభుత్వంలో స్థానిక సంస్థల నుంచి గెలిచిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు.

– నరాల రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ, రామచంద్రపురం మండలం

వెంటనే గౌరవ వేతనం మంజూరు చేయాలి



రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం వెంటనే మంజూరు చేయాలి. అదే విధంగా ప్రజల నుంచి ఎంపికైన మాకు గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి. స్థానిక సంస్థల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు తగిన గౌరవం ఇవ్వాలి.

– పలివెల మధు, ఎంపీటీసీ, వడ్లమూరు, కపిలేశ్వరపురం మండలం

సచివాలయానికి ఒక వీఆర్వోను కొనసాగించాలి



తహసీల్దార్ రవీంద్రనాథ్‌ఠాగూర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మండల వీఆర్వోలు

కాజులూరు: సచివాలయానికి ఒక వీఆర్వోను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు అన్నారు. బుధవారం తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ రెవెన్యూ ఉద్యోగులు మండల తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళనలు చేపటి తహసీల్దార్ రవీంద్రనాథ్‌ఠాగూర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న రెండు గ్రామ సచివాలయాలను ఒక క్లస్టరుగా మార్చి ప్రతి క్లస్టరుకు ఒకే వీఆర్వో ఉండేలా జీఓ నంబరు నాలుగు విడుదల చేసిందన్నారు. సచివాలయాలకు వచ్చే 95 శాతం అప్లికేషన్లు వీఆర్వోల ద్వారానే పరిష్కరించ బడుతున్నాయన్నారు. ఇప్పటికే పనిభారంతో ఇబ్బందులు పడుతున్న వీఆర్వోలకు క్లస్టర్ల పేరుతో రెండేసి సచివాలయాలను అప్పగిస్తే మరింత పని భారంతో మానసిక ఒత్తిళ్లకు గురై అనారోగ్యాలపాలవుతారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం పునారాలోచన చేయాలన్నారు. మండల గ్రామాలకు చెందిన వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆహార నియమాలపై శ్రద్ధ వహించాలి



వైద్యులను సన్మానిస్తున్న పీఎంపీ అసోసియేషన్ నాయకులు

కాజులూరు: ఆహార నియమాలపై ప్రజలు తగిన శ్రద్ధ వహించాలని ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ డి.శ్రీకాంత్ అన్నారు. బుధవారం గొల్లపాలెంలోని కమ్యూనిటీ పారా మెడికల్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ (పీఎంపీ అసోసియేషన్) భవనంలో కాజులూరు, కరప మండల యూనిట్ అధ్యక్షుడు జేవీవీ సూర్యనారాయణ అధ్యక్షతన పలు వ్యాధులపై నిపుణులైన వైద్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పేగుల్లో వచ్చే క్యాన్సర్ వ్యాధులు, లివర్, గాల్ బ్లాడర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నెఫ్రాలజిస్ట్ సానా ప్రవీణ్ మాట్లాడుతూ కిడ్నీ సంబంధిత వ్యాదులు, డయాబెటిక్, హైపర్‌టెన్షన్ వల్ల కిడ్నీ పనితీరులో వచ్చే తేడాలపై పీఎంపీ వైద్యులు, స్థానికులకు పలు సూచనలు చేశారు. అనంతరం అవగాహన కల్పించిన వైద్యులకు పీఎంపీ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, రాష్ట్ర నాయకుడు కేఎస్ఎన్ బాబు, మండల కార్యదర్శి ఆర్.వినయ్‌కుమార్, సంఘం రాష్ట్ర నాయకులు కేఎస్ ఆచార్యులు, మండల గ్రామాలకు చెందిన పలువురు పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

అసంపూర్తి గదులకు ప్రతిపాదనలు ఇవ్వండి

డీఈఓ సలీం బాషా



కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న డీఈఓ సలీం బాషా

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు, ప్రహరీ నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి పంపాలని సమగ్ర శిక్షా సైట్ ఇంజినీర్‌ను జిల్లా విద్యా శాఖాధికారి షేక్ సలీం బాషా ఆదేశించారు. సాధారణ పరిశీలనలో భాగంగా బుధవారం ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాల నిర్వహణకు కావాల్సిన సదుపాయాలపై హెచ్ఎం మాలతిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలను ఎలా రాస్తున్నారని వాకబు చేశారు. డీఈఓ వెంట ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, చింతా వెంకట సోమిరెడ్డి, పీడీ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

అకాల వర్షాలతో ఆందోళన

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తన ద్రోణి
- నీట నానుతున్న ధాన్యపు రాశులు



గొల్లపాలెంలో జలమయమైన కాకినాడ-కోటిపల్లి రహదారి

కాజులూరు: తూర్పు తీరప్రాంతం వెంబడి ఏర్పడ్డ ఆవర్తనద్రోణి ప్రభావంతో కాజులూరు మండల గ్రామాల్లో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పల్లపు ప్రాంతాల్లోని వీధుల్లో వర్షపునీరు చేరి జలమయమవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కాకినాడ, కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం చెరువుగట్టు సెంటర్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచిపోయి రోడ్డు మునిగిపోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అప్పుల భయం

నియోజకవర్గంలో రైతాంగం కష్టాలతో కొట్టుమిట్టాడుతుంది. ఈ ఏడాది పంటల పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీ కూడా రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మాసూళ్లు నిర్వహిస్తున్న ధాన్యం తడిసి ముద్దయింది. కళ్లాల్లో ఆరబెట్టిన తడిసిన ధాన్యంను రాశులుగా చేసి గడ్డి మూత వేసేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. కోతకోయని పొలాల్లో నిలిచిపోయిన వర్షపు నీటిని బయటకు మళ్లించేందుకు బోదెలు ఏర్పాటు చేసుకుంటూ, నేలనంటిన దుబ్బులను నిలబెట్టి కడుతూ ఉన్నపంటను దక్కించుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. కోతకోసి మాసూళ్లు చేపట్టిన పంట వర్షాలకు తడిస్తే రంగుమారి నాణ్యత లోపిస్తుందని కోత దశలో ఉన్న పంట పొలాల్లో రోజుల తరబడి నీటమునిగితే దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని రైతులంటున్నారు. బంగాళాఖాతం మీదుగా ఏర్పడ్డ ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో తూర్పు తీరం వెంబడి మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్న వాతావరణ నిపుణుల ప్రకటనలు రైతులకు కంటిమీద కునుకులేకుంగా చేస్తున్నాయి.

మూతపడిన ఇటుక బట్టీలు

కపిలేశ్వరపురం: మండలంలోని అనేక గ్రామాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన జీవినం స్తంభించింది. ఎండలు మండాల్సిన మే నెలలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు, చిరు వ్యాపారులు, చిరుద్యోగులు, ఉద్యాన రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తరచూ వర్షం కురుస్తుండటంతో రోజు కూలీకి పోలేని స్థితిలో అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, కపిలేశ్వరపురం, లంక గ్రామాల్లోని ఇటుక బట్టీలు మూతపడ్డాయి. వేసవికాలంలో బట్టీ కార్మికులు తెల్లవారుజామునే నిద్రలేచి ఉదయం 11 గంటలు వరకూ పని చేసుకుంటారు. వర్షాలతో మొత్తం బట్టీలు మూతపడ్డాయి. మండలంలోని వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల నుంచి మండపేటలోని రైసుమిల్లుల్లో పని చేసే కార్మికులు ద్విచక్ర వాహనాల్లో పనిప్రదేశానికి తెల్లవారుజామునే వెళ్తుంటారు. వారికీ ప్రస్తుత వర్షాలు ఆటంకంగా మారాయి.



కాజులూరులో నీట నానుతున్న కోత కోసిన వరి పనలను చూపుతున్న రైతులు



వెదురుమూడిలో బరకం కప్పి ఉన్న ఇటుకలు

పోలీస్‌స్టేషన్ ముందు ఇసుక లారీలు

- నోరు మెదపని అధికారులు
- కేసు నమోదు చేయకపోవడం విడ్డూరం



కె.గంగవరం పోలీస్‌స్టేషన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎక్కడి నుంచి తరలించారో గాని ఏటిగట్టు నుంచి వస్తున్న ఇసుక లారీలను గనుల శాఖ అధికారులు తీసుకువచ్చి కె.గంగవరం పోలీస్‌స్టేషన్ వద్ద నిలుపుదల చేసిన సంఘటన సంచలనంగా మారింది. కె.గంగవరం ఎస్సై జానీబాషా, గనుల శాఖ అధికారి సుజాత, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కపిలేశ్వరపురం మండల నుంచి ఏటిగట్టు మీదుగా అనధికారికంగా ఇసుక తరలిస్తున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు లారీలను అదుపులోకి తీసుకుని కె.గంగవరం పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించినట్లు చెప్పారు. అయితే దీనిపై అనధికారికంగా ఇసుక లారీల అక్రమ తరలింపుపై ఇప్పటి వరకు పోలీసులు కేసు నమోదు చేయకపోవడం వివాదాస్పదంగా మారింది. భారీ ఎత్తున కె.గంగవరం స్టేషన్‌కు లారీలను తరలించడం సంచలనంగా మారింది. ఇదిలా ఉండగా కపిలేశ్వరపురం మండలానికి చెందిన కూటమి నాయకులు అనధికారంగా ఇసుక తరలిస్తుంటే అదే కూటమికి చెందిన నాయకులు ఫిర్యాదు చేయడంతో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు తెలిసింది.

ఇదే విషయంపై కూటమి నాయకులు గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారాన్ని చక్కబెట్టి లారీలను తరలించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కపిలేశ్వరపుం మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక ర్యాంపుల నుంచి రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం వైపు భారీగా ఇసుక లారీ తరలించి డంప్ చేయడంపై కూటమి నేతల మధ్య రచ్చ రగిలినట్లు ఈ మేరకే స్టేషన్ వద్దకు తరలించినట్లు తెలిసింది.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణ మూలమంత్ర హోమం



సీతారామచంద్రస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో సీతారామచంద్రస్వామికి ఆవిర్భావ శతాబ్ది మహోత్సవంలో భాగంగా నాలుగో రోజు అయిన బుధవారం స్వామికి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు విశేష పూజలు జరిపారు. అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ ఆవాహనం, శ్రీలక్ష్మీనారాయణ మూల మంత్ర హోమం, పాయస హోమం, వర్షవర్ధన దైవత్య ప్రధాన హోమం, శాంతి హోమం వంటి విశేషపూజలు జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవారిని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం జరిపారు. కోలాటం నిర్వహించారు. సాయంత్రం విష్ణు దైవత్వ శ్రీ భూదైవత్య ప్రధానం హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆఖరి రోజైన గురువారం స్వామికి మహాపట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నీటి గుంత.. రోగులకు చింత



గొల్లపుంత టిడ్కో కాలనీలో అర్బన్ పీహెచ్‌సీకి వెళ్లే రహదారిలో ఏర్పడిన గుంత

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట గొల్లపుంత టిడ్కో కాలనీలో అర్బన్ పీహెచ్‌సీకి వెళ్లే రహదారిలో నీటి గుంత రాకపోకలకు ఆటంకంగా మారింది. పీహెచ్‌సీకి సీసీ రహదారే అయినప్పటికీ.. అక్కడకు వెళ్లే అప్రోచ్‌లో నీటి గుంతలున్నాయి. టిడ్కో గృహాలతో పాటు, గొల్లపుంత కాలనీలో వేలాది నివాసాలున్నాయి. ఆ ప్రాంతానికి చెందిన రోగులు ఆస్పత్రికి రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి గుంతను పూడ్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తుప్పలతో ప్రమాదం



కోట రోడ్డులో ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా ఉన్న తుప్పలు

కె.గంగవరం: ఏటిగట్టుపై రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. కోటిపల్లి నుంచి కోట వరకు ఏటిగట్టుపై తుప్పలు ఏపుగా ఎదిగి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండడం, దీనికి తోడు తుప్పలు రోడ్డు మధ్య వరకు ఎదగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో ఈ రహదారులు పలువురు ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలు కాగా పాలకొల్లుకు చెందిన వ్యక్తి మృతి చెందాడని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్లకు ఇరువైపులా చెత్తమొక్కలు ఏపుగా ఎదిగి ప్రమాదకరంగా మారాయి. గతేడాది ఆర్అండ్‌బీ అధికారులు తుప్పలను తొలగించినా మళ్లీ అవి ఎదిగిపోయాయని పూర్తి స్థాయిలో వీటిని తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం



రంకిరెడ్డి సింహాద్రి (ఫైల్)

అంబాజీపేట: వివిధ సమస్యల కారణంగా మనస్థాపానికి గురై పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబాజీపేటకు చెందిన రంకిరెడ్డి సింహాద్రి(40) మంగళవారం మొసలపల్లి శివారు కొబ్బరితోటల్లో పురుగు మందు తాగాడు. స్థానికులు గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య జ్యోతి, కుమార్తె కీర్తి, కుమారుడు శ్రీరామ్ ఉన్నారు.